క్లుప్తంగా

విజయదుర్గాదేవికి లక్ష కుంకుమార్చన



అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు హనుమంతవాక దరి విజయదుర్గా కాలనీలోని విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం రెండు రోజులుగా నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన చేపట్టారు. విజయదుర్గా కాలనీ, హనుమంతవాక తదితర ప్రాంతాల మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి దర్శించుకుని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరించారు.

కూరగాయల కొరత లేకుండా చూడండి



ఎంవీపీ రైతుబజార్‌లో రైతులకు సూచనలిస్తున్న డీడీ పాపారావు

ఆరిలోవ: జిల్లా అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి, డీడీ పాపారావు శుక్రవారం ఎంవీపీ రైతుబజార్‌ను సందర్శించారు. ఈవో వరహాలుతో కలసి అన్ని స్టాళ్లను పరిశీలించారు. రైతులతో సమావేశం నిర్వహించారు. రైతుబజార్‌లో కూరగాయల కొరత లేకుండా చూడాలని ఈవోకు పాపారావు ఆదేశించారు. గ్రామాల్లో తోటి రైతులు పండించే టమాటాలను తీసుకువచ్చి రైతుబజార్‌లో విక్రయించాలని రైతులు, డ్వాక్రా మహిళలకు ఆయన సూచించారు. దీంతో గ్రామాల్లో టమాటా పండించే రైతులకు సహకరించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు కనకరాజు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థుల సందడి



బయోడైవర్సిటీ పార్క్‌లో డిగ్రీ విద్యార్థులు

బీచ్‌రోడ్డు: బొబ్బిలికి చెందిన ఓ డిగ్రీ కాలేజీ విద్యార్థులు శుక్రవారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్క్ పర్యవేక్షకుడు రామామూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను తెలియజేశారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతారణం తదితర అంశాల గురించి వివరించారు. బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థులంతా సందడి చేశారు.

బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి



సీతమ్మధార యూనియన్ బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సీతమ్మధార: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మార్చి 24, 25న దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చామని యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఆర్.వసంతరావు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సీతమ్మధార బ్రాంచి వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని బ్యాంకుల బ్రాంచిలలో ఖాళీగా ఉన్న ఉద్యోగ నియామకాలను చేపట్టాలని, వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు పరచాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వరంగ బ్యాంకులలో వర్క్ మెన్, ఆఫీసర్స్ డైరెక్టర్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు మహీంద్ర, ఆడారి శ్రీను, రమేష్, ఈశ్వర్, శ్రీనివాస్, అనిల్, సుజాత, ప్రత్యూష పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!



బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20, 22 వార్డుల్లో చెత్త విపరీతంగా పేరుకుపోతోంది. రోడ్లు, కాలువలన్నీ చెత్తతో నిండిపోతున్నాయి. ముఖ్యంగా రహదారులపై నిత్యం చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు చెత్త, వ్యర్థాలను తొలగించడం లేదని, రోడ్లను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన భరితంగా మారాయని వార్డు ప్రజలు చెబుతున్నారు. ఒకవైపు దోమల దాడులు.. మరోవైపు చెత్త పోగులు, అధ్వాన పారిశుధ్యంతో స్థానిక ప్రజలు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం

20, 22 వార్డుల్లో కొద్ది రోజులుగా పారిశుధ్య కార్మికులు చెత్తను తరలించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్ల మీద, డస్ట్ బిన్ల వద్ద పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోతోంది. 20వ వార్డు ఈస్ట్ పాయింట్ కాలనీ, చినవాల్తేరు, కేడీపీఎం స్కూల్, 22వ వార్డు పీతలవానిపాలెం, పిఠాపురం కాలనీ ప్రాంతాల్లో రహదారులన్నీ చెత్తతో నిండిపోయాయి. దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లపై, నివాస ప్రాంతాల చుట్టూ చెత్త పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయిని నివాసులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో నిద్ర లేకపోవటంతోపాటు అనారోగ్య సమస్యలు సైతం వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈస్ట్ పాయింట్ కాలనీలో రోడ్డుపై చెత్తకుప్ప

పాఠశాల చుట్టూ చెత్తే..

ఈస్ట్ పాయింట్ కాలనీలోని కేడీపీఎం హైస్కూల్ ప్రహరీ చుట్టూ నిత్యం చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. స్కూల్‌కు నాలుగు వైపులా ఉన్న గోడల వద్ద పెద్ద సంఖ్యలో చెత్త పేరుకుపోయింది. పాఠశాలకు వచ్చి పోయే సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పారిశుధ్య సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



పీతలవానిపాలెంలో డస్ట్ బిన్ వద్ద చెత్త పోగులు



కేడీపీఎం స్కూల్ ప్రహరీ వద్ద పేరుకుపోయిన చెత్త

పర్యవేక్షణ కరువు

పారిశుధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం వహించడంలో అధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. ముఖ్యంగా జీవీఎంసీ కమిషనర్ లేకపోవటంతో కింది స్థాయి ఉద్యోగుల పర్యవేక్షణ కరువైంది. దీంతో పారిశుధ్య కార్మికులు చెత్త తొలగింపును పూర్తిగా మరిచిపోయారు. పారిశుధ్య సమస్యలతో ఇబ్బందులు తప్పడం లేదని 20, 22 వార్డుల ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల మీద, కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలి

మా ప్రాంతంలో రహదారులపై చెత్త పేరుకుపోతోంది. పారిశుధ్య కార్మికులు సకాలంలో చెత్తను తొలగించడం లేదు. దుర్వాసనతో పాటు దోమల వల్ల ఇబ్బంది పడుతున్నాం. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఎప్పటికప్పుడు చెత్త తొలగించేలే చర్యలు చేపట్టాలి.

– ఎ.జయదీప్, ఈస్ట్ పాయింట్ కాలనీ

పార్వతీనగర్ గెడ్డ.. చెత్తకుప్పలకు అడ్డా



పార్వతీనగర్ గెడ్డలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పార్వతీనగర్ గెడ్డలో నెలల తరబడి చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దీనిని పారిశుధ్య విభాగం అధికారులు తొలగించడం లేదు. ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఈ గెడ్డ పెద్ద చెత్త కుండీని తలపిస్తోంది. టీఐసీ పాయింట్, అంబేడ్కర్ నగర్ ప్రాంతాల వీధి కాలువల నుంచి ఈ గెడ్డలోకి మురుగు నీరు చేరుతుంది. ఆయా కాలువల ద్వారా మురుగుతోపాటు కిందకు కొట్టుకువచ్చిన పాలిథిన్ కవర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ బాటిళ్ల తదితర చెత్త ఈ గెడ్డపై కల్వర్టు వద్ద నిలిచిపోతోంది. దీన్ని ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నా.. పారిశుధ్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఇక్కడ చెత్త కుప్పలుగా నిల్వ ఉండిపోయింది. దీని నుంచి దుర్వాసన రావడంతో ఇళ్ల తలుపులు తెరవలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

'యూజీసీ ముసాయిదా-2025ను వ్యతిరేకించండి'



కృష్ణా కళాశాల గేటు వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

మద్దిలపాలెం: యూజీసీ ముసాయిదా–2025ను వ్యతిరేకిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అధ్యాపకులు, ఆచార్యుల నియామకాలు, పదోన్నతికై కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణకు మార్గదర్శకాలు-2025 పేరుతో ఒక ముసాయిదాను రూపొందించిందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాస్తూ, అనేక ఘోర మార్పులకు దారి తీసేలా ఉందని చెప్పారు. వాటిలో వైస్ చాన్సలర్ల నియామక నిబంధనలను పూర్తిగా మార్చడం అత్యంత కీలకమైనదన్నారు. వీరి నియామకాలకు సంబంధించి ఇప్పటివరకు ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పాత్రకు పాతరేసి, అన్ని అధికారాలను గవర్నర్లకు అప్పగించాలని పేర్కొనడం అన్యాయమన్నారు. వీసీల ఎంపికకు సంబంధించిన విద్యాపరమైన అర్హతలను సైతం సరళించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో కానీ, విద్యా రంగ నిపుణులతో కానీ ఏ మాత్రం చర్చించకుండా కేంద్ర ప్రభుత్వం, యూజీసీ కలిసి ఈ ముసాయిదాను రూపొందించి విడుదల చేశారన్నారు. ఇప్పుడిది ముసాయిదా రూపంలో ఉండగానే ఆంధ్రా యూనివర్సిటీ వీసీగా ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ రాజశేఖర్‌ను నియమించడం రాజ్యాంగాన్ని కించపరచడమేనని వ్యాఖ్యానించారు. కేంద్ర నిర్ణయాన్ని విద్యార్థులు, మేధావులు వ్యతిరేకించాలని పీడీఎస్‌వో పిలుపునిస్తోందన్నారు. జిల్లా కమిటీ సభ్యులు యమున, లక్ష్మణ్, సతీష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, విభాగాధిపతులు

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం సమావేశ మందిరంలో కాలేజీ ప్రిన్సిపాల్ సభాధ్యక్షుడిగా జరిగిన సభలో ప్రధాన వక్తలుగా ఆంగ్లం, తెలుగు, సంస్కృతం, హిందీ విభాగాధిపతులు ఆర్.రాణి, ఎస్.శారద, పోల ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మి తెలుగు భాష గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, కె.రవిబాబు, ఎం.రాజేశ్వరరావు, శ్రావణ్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థులు, భాషా ప్రియులు, భాషాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషను పరిరక్షించుకుందాం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ డి.ప్రవీణ మాట్లాడుతూ మాతృభాషను పరిరక్షించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తెలుగును తేనెలొలికే భాషగా ప్రపంచ దేశాలు కీర్తించాయని చెప్పారు. యువత వారి ఉన్నత ఆకాంక్షలకు, కెరీర్‌కు అనుగుణంగా ఎన్ని భాషలు నేర్చుకున్నప్పటికీ మాతృభాష తెలుగును విస్మరించకూడదన్నారు. అనంతరం డాక్టర్ ప్రవీణను కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.ఎస్.బోస్, ప్రగడ రాజగణపతి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ ప్రవీణను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ముగిసిన యోగా శిక్షణ శిబిరం



శిక్షణ పొందిన వారితో క్లబ్, ఎస్ యోగా ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: ఎస్ యోగా, శివాజీ పార్క్ గొడుగు వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ నెల 17 నుంచి యోగా గురువు రాజగోపాల్ పర్యవేక్షణలో శిక్షకుడు శివలక్ష్మణ్ 50 మందికి శివాజీ పార్క్‌లో ఉచిత యోగా శిక్షణ అందించారు. వివిధ ప్రాణాయామ పద్ధతులు, సూర్య నమస్కారాలు తదితర ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. యోగా ద్వారా ఆరోగ్యానికి జరిగే మేలును వివరించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల సేవలను శిక్షణ పొందిన వారు అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కె.శివరామకృష్ణ, ఎస్.రామకృష్ణ, వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త వెంకోజీపాలెంలో స్థలం పరిశీలన



కొత్త వెంకోజీపాలెంలో స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్ తదితరులు

సీతమ్మధార: జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ జ్ఞానానంద ఆశ్రమం దరి శ్మశానవాటిక స్థలాన్ని తహసీల్దార్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో సర్వే చేశారు. ఈ స్థలం తనదేనంటూ ఇక్కడి పూర్ణానంద స్వామి అలియాస్ పున్నయ్య స్వామి వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఈ భూములను శుక్రవారం పరిశీలించారు. ఇది రెవెన్యూ రికార్డు ప్రకారం కొండపోరంబోకు కిందకు వస్తుందని తహసీల్దార్ స్పష్టం చేశారు. ఆయన వెంట వీఆర్వోలు ఖాదర్, అనురాధ, సర్వేయర్లు పైడిరాజు, సత్యనారాయణ ఉన్నారు. భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్ మద్దిలపాలెం, రేసపువానిపాలెంలోని యూఎల్‌సీ భూములను శుక్రవారం పరిశీలించారు.

చర్లపల్లి - దానాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి-దానాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. చర్లపల్లి–దానాపూర్(07749) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ శనివారం ఉదయం 9.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి అదే రోజు రాత్రి 10.55 గంటలకు విజయనగరం చేరుకుంటుంది. అక్కడ నుంచి 11 గంటలకు బయలుదేరి సోమవారం తెల్లవారు 2 గంటలకు దానాపూర్ వెళ్తుంది. దానాపూర్–చర్లపల్లి (07750) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ దానాపూర్‌లో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

చర్లపల్లి–దానాపూర్(07751) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మంగళవారం తెల్లవారు 2 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. దానాపూర్–చర్లపల్లి (07752) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ దానాపూర్‌లో ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైళ్లకు కొత్తవలసలో హాల్ట్ ఉందని డీసీఎం తెలిపారు.

9 కేజీల గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి 9 కేజీల గంజాయి సీజ్ చేశారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతాదళం పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్‌పీ ఎస్‌ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తమిళనాడు రాష్ట్రం రామనాథపురం జిల్లాకు చెందిన కె.సూర్యప్రకాష్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు నిర్ధారించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని 9 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

అభాగ్యులకు ఆశ్రయం



వసతిగృహంలో సదానందం



మురళిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా బృందం సభ్యులు

సీతమ్మధార: గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన మానాల సదానందం (58) బట్టల దుకాణంలో పని చేసేవాడు. అయితే అతని భార్య మరణించడంతో కలత చెంది విశాఖ వచ్చేసాడు. అతన్ని ఏయూటీడీ సిబ్బంది శుక్రవారం గుర్తించి భీమ్‌నగర్‌లో గల షెల్టర్ హోంకు తరలించినట్లు కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

సొంతూరు చేరిన వ్యక్తి..

ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తిరుగుతున్న మురళి (32) అనే వ్యక్తిని అప్నాఘర్ ఆశ్రమ్ ప్రతినిధులు నవంబర్ 2024లో గుర్తించారు. అతనికి కొన్ని రోజులు వసతి కల్పించారు. తర్వాత చికిత్స నిమిత్తం ముంబైలోని శ్రద్ధా ఫౌండేషన్‌కు పంపించారు. అక్కడ పూర్తిగా కోలుకోవడంతో అతన్ని తన సొంతూరు పార్వతీపురం మన్యం జిల్లా దగ్గర వేమకోటవరం పంపడానికి నగరంలోని ఏయూటీడీ షెల్టర్ హోంకు తీసుకొచ్చారు. అతన్ని తీసుకుని ఆ ఊరికి వెళ్తే అతని తల్లిదండ్రులు చనిపోయారని, ఎవరూ లేరని గ్రామస్తులు చెప్పారు. దీంతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సహకారంతో ఐఆర్‌పీడబ్ల్యూఏ సంస్థ పార్వతీపురంలో నడుపుతున్న డే–నైట్ షెల్టర్ హోంకి తీసుకెళ్లి ఆశ్రయం కల్పించారు. అతనికి ఏదైనా ఉపాధి కల్పిస్తామని అక్కడి షెల్టర్ సిబ్బంది తెలిపారు.

ఉద్యోగులకు అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిర్ణీత సమయంలో ఫిర్యాదులు పరిష్కరించాలని అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఈ కార్యక్రమానికి సంబంధించి ఫిర్యాదులపై అధికారులు, ఉద్యోగులు నిర్ణీత సమయం కేటాయించి, వాటిని పరిష్కరించాలని, చాలా మంది ఉద్యోగులు పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తద్వారా ప్రజా సమస్యలు నిర్ణీత సమయంలో పరిష్కారం కావడం లేదన్నారు. అశ్రద్ధ వహించిన వారిపై ఇప్పటికే చార్జ్ మెమోలు జారీ చేశామని, ఇకపై క్రమశిక్షణ చర్యలు చేపడతామన్నారు. నిర్లక్ష్యం చేస్తున్న ఉద్యోగులపై కలెక్టర్ ఆగ్రహంగా ఉన్నారని, ఇకపై అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీజీఆర్ఎస్‌కి సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేకంగా నోడల్ అధికారులు రాష్ట్ర స్థాయిలో సమస్యల పరిష్కారంపై నిత్యం విచారణ చేపడతున్నారన్నారు. ప్రజలకు అందించాల్సిన సేవల్లో భాగంగా వారు పెట్టుకున్న అర్జీలపై పీజీఆర్ఎస్ వెబ్‌సైట్ ద్వారా నిత్యం పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులు, ఉద్యోగులకు అదనపు కమిషనర్లు ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం పీజీఆర్ఎస్ సెల్ నుంచి వచ్చిన నిపుణుడు అశోక్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వెబ్ లాగిన్ అయ్యే విధానం, విధి విధానాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు, ఉద్యోగులకు వివరించారు.

కప్పరాడ యూపీహెచ్‌సీ సందర్శన



యూపీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: కంచరపాలెం జాతీయ రహదారిలో కప్పరాడ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో పలు ప్రాంతాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఓపీ, ఐపీ సేవలు, డయాగ్నోస్టిక్ సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అభ ఐడీ నూరు శాతం అమలయ్యేలా చూడాలన్నారు. నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల లార్వా పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, ఇతర పట్టణ వైద్య అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.